# స్వల్పకాలానికి ర్యాలీ




**సమీక్ష:** గత వారం ప్రారంభంలో ఊగిసలాట ప్రదర్శించినా 20218 స్థాయిని దాటిన తర్వాత సెన్సెక్స్ మరింత ముందుకెళ్లింది. 20509 వద్ద ముగిసి 435 పాయింట్లు లాభపడింది. చైనా వడ్డీ రేట్లను పెంచడంతో మార్కెట్ బలహీనంగా ప్రారంభమైంది. ఆ తర్వాత సానుకూల అంతర్జాతీయ పరిణామాలతో లాభాలొచ్చాయి. ఆహార ద్రవ్యోల్బణం పెరిగినా కూడా దాని ప్రభావం పడలేదు. ఎఫ్ఐఐలు రూ. 3409 కోట్ల మేర నికర కొనుగోళ్లు చేయగా.. ఫండ్లు రూ. 436.80 కోట్ల నికర విక్రయాలు చేశాయి.

**రంగాల వారీగా:** మన్నికైన వినిమయ వస్తువుల సూచీ అధిక లాభాలు పొందింది. స్థిరాస్తి రంగంలో కొనుగోళ్లు జరగడంతో కాస్త పుంజుకుంది. బ్యాంకింగ్ షేర్లూ మదుపర్లను ఆకర్షించాయి. ముడి చమురు ధరలు పెరుగుతూ ఉండడంతో చమురు-సహజవాయువు సూచీలో బలహీనత కొనసాగింది. యంత్రపరికరాలు, లోహ సూచీలు సైతం డీలాపడ్డాయి. లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 2:1గా నమోదు కావడం చూస్తే మధ్య స్థాయి, చిన్న స్థాయి షేర్లలో కొనుగోళ్లు జరిగినట్లు తెలుస్తోంది.

**ఈ వారంపై అంచనాలు:** గతవారం మార్కెట్లు బలంగా ముగియడం చూస్తే స్వల్పకాలానికి మార్కెట్లు ముందుకు కొనసాగుతాయని అంచనా. కొద్ది వారాలుగా మార్కెట్ స్థిరంగా లాభాలు పొందుతూ వస్తోంది. దీన్ని బట్టి అంతక్రితం ఎదురైన దిద్దుబాటు ముగిసిందని భావించాలి. వచ్చే కొద్ది వారాల్లో మార్కెట్ ఆల్‌టైం గరిష్ఠ స్థాయి(ఇంట్రాడే) 21207కు చేరొచ్చని అంచనా. అథోముఖంలో గమనిస్తే 60 రోజుల చలన సగటైన 20074 వద్ద కీలక మద్దతు ఉంది. దీనికంటే కిందకు మార్కెట్ వస్తే స్వల్పకాలంలో దిద్దుబాటు జరిగే అవకాశాన్ని కొట్టిపారేయలేం.

**ప్రభావితం చేసే అంశాలు:** వాహన విక్రయాలు, సిమెంటు ఉత్పత్తి, టెలికాం వినియోగదార్ల గణాంకాలు, ఆహార ద్రవ్యోల్బణం, త్రైమాసిక ఫలితాలు, ఎఫ్ఐఐల పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు, ముడి చమురు ధరలు.. వీటన్నిటిపైనా మార్కెట్ దిశ ఆధారపడి ఉంది.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 20380, 20218, 20074; **తక్షణ నిరోధ స్థాయిలు:** 20706, 20984, 21207

**స్వల్ప కాలంలో మార్కెట్లో ర్యాలీ కనిపించొచ్చని అంచనా**

*–సతీశ్ కంతేటి, జెన్ మనీ*